క్లుప్తంగా

కాలభైరవస్వామిని దర్శించుకున్న ఏసీపీ



పూజలు చేస్తున్న ఏసీపీ రవికుమార్

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి గ్రామంలో కొలువుదీరిన కాలభైరవస్వామిని మంగళవారం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సందర్శించి స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. పండితుడు భూషణ్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు ఏసీపీ రవికుమార్‌కు ముందుగా శాలు వాతో సన్మానించి ఆలయ గొప్పతనం వివరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు రాజేశ్, శ్రీకాంత్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 57వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్, ముదాం మల్లేశ్, పల్లి రాకేశ్, బొద్దున మల్లేశ్, రెడ్డిమల్ల అశోక్, నాగుల రాజన్న, దేవరకొండ వెంకన్న, చిరంజీవి, తరుణ్‌సింగ్, జగ్జిత్ సింగ్ పాల్గొన్నారు.

మామిడిపల్లిలో సేవాలాల్ ఉత్సవాలు



సేవాలాల్ పూజల్లో బంజారాలు

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లిలో బంజార సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. హోమం, ప్రత్యేక పూజలతో పాటు జెండా ఆవిష్కరణ చేశారు. బంజార సేవాసమితి నాయకులతో పాటు, స్థానిక నాయకులు రాంచందర్, త్రిమూర్తి, తిరుపతి, సత్తయ్య పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ సందర్శన



దర్శించుకుంటున్న విద్యార్థులు

కోటపల్లి: మండలంలోని రాంపూర్ గ్రామంలో నూతనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయగా మంగళవారం రాంపూర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సందర్శించి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థుల్లో భక్తిభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ప్రిన్సిపాల్ వోద్ది సంతోశ్ తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ విద్యాసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూసారం, సాగునీటి సేకరణపై అవగాహన



మట్టి నమూనాలు సేకరిస్తూ..

తాండూర్: పంటలు సాగు చేస్తున్న రైతులు భూసారం కాపాడుకోవాలని ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థులు అన్నారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులు మంగళవారం వ్యవసాయ అనుభవ పూర్వక అభ్యాసన కార్యక్రమంలో భాగంగా తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామాన్ని సందర్శించారు. రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించి భూసారం, సాగునీటి సేకరణ గురించి విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. పంట పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుష్మ, వ్యవసాయ విస్తరణ అధికారులు శంకర్, వెంకటేష్, ధనలక్ష్మి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు శ్రీధర్, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



జన్నారం: మండలంలోని కలమడుగు శ్రీ నరనారాయణ స్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని మంగళవారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు కాకర నర్సయ్య, రాజనరేంద్ర శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించగా 150మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. రోటిగూడ గీతమాత ఆలయ పూజారి శ్రీహరి మౌనస్వామి హాజరయ్యారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, సభ్యులు అంజగౌడ్, శంకరయ్య, బొంతల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ గద్దెలు ముస్తాబు

చెన్నూర్‌రూరల్/కోటపల్లి: నేటి నుంచి గురువారం వరకు నిర్వహించే సమ్మక్క-సారలమ్మ మినీ జాతరను పురస్కరించుకొని నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చెన్నూర్ మండలంలోని సుబ్బరాంపల్లి, కిష్టంపేటలో, కోటపల్లి మండలంలోని మల్లంపేటలో సమ్మక్క-సారలమ్మ గద్దెలను ముస్తాబు చేశారు. ఈ నెల 12న కంకవనం, సారలమ్మను గద్దె వద్దకు తీసుకువస్తారు. 13న సమ్మక్కను గద్దెపైకి తీసుకొస్తారు. అనంతరం అమ్మవార్లకు బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోవాలని నిర్వాహకులు కోరారు. మూడు రోజుల పాటు జాతర కొనసాగుతుంది.



పత్తి కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని వరలక్ష్మి జిన్నింగ్ మిల్లు ఎదుట చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై మంగళవారం పత్తి రైతులు ధర్నా చేపట్టారు. వారం రోజులుగా పత్తి కొనుగోలు చేయడం లేదంటూ సీసీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు పత్తి కొనుగోలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని రైతులను సముదాయించి ధర్నా విరమింపజేశారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

- ఎస్ఓటు జీఎం సత్యనారాయణ



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సత్యనారాయణ

శ్రీరాంపూర్: ఉద్యోగులకు సంబంధించిన చెల్లింపులు, ఇతర పెండింగ్ కేసులను త్వరగా సెటిల్ చేయాలని శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ తెలిపారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఏరియాలోని సంక్షేమ అధికారులు, పర్సనల్ అసిస్టెంట్లు, పేషీట్ క్లర్కులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని త్వరగా పరిష్కరించి, చక్కదిద్దే బాధ్యత సంక్షేమ అధికారిదన్నారు. ఏరియాలో పదవి విరమణ పొందిన, అనారోగ్య సమస్యలతో మెడికల్ ఇన్వాలిడేషన్ అయినా వారి కేసులను త్వరగా సెటిల్ చేయాలన్నారు. అనంతరం డీజీఎం(పర్సనల్) అరవింద రావు మాట్లాడుతూ.. ఏరియాలో ఇంకా ఇన్‌కమ్ టాక్స్ ఫైలింగ్ చేయని వారు 45మంది ఉన్నారని, పాన్‌కార్డుతో ఆధార్‌ను అనుసంధానం చేసుకోని వారు 150మంది ఉన్నారన్నారు. వీరందరూ 15లోగా అనుసంధానం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేష్, సీనియర్ పీఓ కాంతారావు, అకౌంట్ ఆఫీసర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ కార్యాలయం ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయం ఎదుట మంగళవారం తాండూర్ మండల వాసులు ఆందోళన చేశారు. సామూహికంగా తరలివచ్చిన యువకులు, మహిళలు ఏసీపీ కార్యాలయం ప్రధాన గేట్ వద్ద నిలబడి కాల్‌టెక్స్ ఏరియాలోని బార్ అండ్ రెస్టారెంట్‌లో బండారి వంశీ అనే యువకుడిపై దాడికి పాల్పడిన నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని నినదించారు. ఈ సందర్భంగా వంశీ కుటుంబ సభ్యులు, బంధువులు మాట్లాడుతూ.. ఈ నెల 7న మద్యం తాగడానికి వెళ్లిన వంశీపై బెల్లంపల్లికి చెందిన ముగ్గురు యువకులు చిత్తుగా తాగి విచక్షణరహితంగా బీరు సీసాలు పగులగొట్టి తీవ్రంగా గాయపర్చారని పేర్కొన్నారు. నిందితులపై ఫిర్యాదు చేయగా పోలీసులు నామమాత్రపు సెక్షన్‌లతో కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిందితులపై మరిన్ని సెక్షన్లు జతచేసి రౌడీషీట్ ఓపెన్ చేయాలని, లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. ఈ ఆందోళనలో బాధితుడి కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులు పాల్గొన్నారు.

నిందితులపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తాం

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియా బార్‌లో మద్యం తాగి ఓ యువకుడిపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపర్చిన నిందితులపై రౌడీషీట్ ఓపెన్‌చేస్తామని బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నిందితులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఐఎన్‌టీయూసీ బాయి బాట



ఇందారం ఐకే1ఏ గనిపై కార్మికులతో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

జైపూర్: ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కార్మిక సంఘం శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఇందారం ఐకే1ఏ గనిపై మంగళవారం బాయిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గనిలో ప్రతీ డిపార్ట్‌మెంట్ నుంచి కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడికక్కడే పరిష్కారమయ్యే సమస్యలను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ నాయకుడు శంకర్‌రావు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర సంపదలో కీలకపాత్ర పోషిస్తున్న సింగరేణి కార్మికుల పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ రద్దు కోసం ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందన్నారు. ఆదేవిధంగా కార్మికుల సొంతింటి కల నెరవేర్చడం కోసం రెవెన్యూ మంత్రితో ఇప్పటికే చర్చించామని పేర్కొన్నారు. కార్మికులకు మెరుగైన సౌకర్యాల కోసం గనిలో క్యాంటీన్ లాకర్ సిస్టం వంటి సౌకర్యాలకు యాజమాన్యంతో మాట్లాడామని తెలిపారు. సింగరేణి మనుగడ కొనసాగించడానికి కొత్త గనుల విస్తరించడం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర డిప్యూటీ ఉపాధ్యక్షుడు గరిగే స్వామి, జనరల్ సెక్రెటరీ ఏనుగు రవీందర్ రెడ్డి, కేంద్రకమిటీ కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, ఫిట్ సెక్రెటరీ రామ్‌చందర్‌నాయక్, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రెటరీ బాలకృష్ణ, పెట్టం శ్రీనివాస్, బొడ్డు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీహెచ్‌పీ డీజీఎం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం మానుకోవాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యక్తిగత నిర్ణయాలు తీసుకుంటూ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్మికులపై, ఉద్యోగులపై పనిభారం మోపుతున్నారన్నారు. తనకు నచ్చిన వారికి మాత్రమే బ్లేడ్‌లు కల్పిస్తున్నారన్నారు. రక్షణ సమావేశాలను కూడా సక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా తన వైఖరి మార్చుకోవాలని సూచించారు.

కానిస్టేబుల్‌పై వరకట్న వేధింపుల కేసు

నెన్నెల: అదనపు కట్నం కావాలని వేధించిన కానిస్టేబుల్‌తో పాటు అతని కుటుంబ సభ్యులపై మంగళవారం నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కుశ్నపల్లి గ్రామానికి చెందిన కామెర తిరుపతి నెన్నెలకు చెందిన కవిత ఐదేళ్ల పాటు ప్రేమించుకున్నారు. ఇరు కుటుంబ సభ్యులను ఒప్పించి 2023 నవంబర్ 17న పెద్దల సమక్షంలోనే బెల్లంపల్లి శివాలయంలో పెళ్లి చేసుకున్నారు. వధువు తల్లిదండ్రులు వివాహ సమయంలో రూ.5 లక్షలు కట్నంగా ఇచ్చారు. కొన్నాళ్లకు తిరుపతికి ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చింది. ట్రైనింగ్ పూర్తి చేసుకొని వచ్చిన తిరుపతి భార్యను తనతోపాటు తీసుకెళ్లేందుకు నిరాకరించాడు. అదనపు కట్నం తెస్తేనే తీసుకెళ్తామని అతనితో పాటు కుటుంబ సభ్యులు వేధించారు. కవిత ఫిర్యాదు మేరకు భర్త తిరుపతి, అత్తామామలు పార్వతి, ధర్మయ్య, బావ రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఆవు మృతికి కారణమైన నలుగురిపై..

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లిలో చాపిడి బక్కయ్యకు చెందిన ఆవు మృతికి కారణమైన నలుగురు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. బక్కయ్యకు చెందిన పశువులు ఈ నెల 2న మేత కోసం అడవికి వెళ్లాయి. సాయంత్రం అందులో ఒక ఆవు ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ నెల 8న కుశ్నపల్లి గ్రామ శివారు అడవిలో ఆవు చనిపోయి ఉంది. బాధిత రైతు ఆరాతీయగా అదే గ్రామానికి చెందిన దుర్గం అశోక్, జాడి నానయ్య, చంద్రపల్లి లాంచయ్య, దుర్గం శేఖర్ అటవీ జంతువుల కోసం అమర్చిన ఉచ్చుకు తగిలి ఆవు మృతి చెందిందని తెలుసుకున్నాడు. బాధితుడు బక్కయ్య ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

క్రైం కార్నర్..

ట్రాక్టర్ డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వారిపై...

మంచిర్యాలక్రైం: ట్రాక్టర్ డ్రైవర్‌పై దాడికి పాల్పడిన పలువురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మందమర్రికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బైరినేని శివకుమార్‌కు పులిమడుగుకు చెందిన కొందరితో హాజీపూర్ సమీపంలోని గోదావరి నదిలో గొడవ జరిగింది. అనంతరం శివకుమార్, బైర్నేని మల్లేశ్, కూన కృష్ణ ఇసుక అన్‌లోడ్ చేసేందుకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా గద్దెరాగడి వద్ద పులిమడుగుకు చెందిన శ్రీనివాస్, తిరుపతి, బానోత్ సంతోష్, అజయ్ మరికొందరు రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్.. నిలిచిన పనులు.. విద్యార్థుల తిప్పలు



భీమారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండేళ్ల క్రితం 'మన ఊరు-మన బడి' లో భాగంగా ప్రారంభించిన వాష్‌బేషిన్ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : వేణుగోపాల్‌రావు, ఎంఈవో ఫోన్ నంబర్ : 63000 27922

వైన్స్‌లో నిల్.. బెల్టుకు ఫుల్!



ఆటోలో బెల్ట్‌షాప్‌కు తరలిస్తున్న కేఎఫ్‌లైట్ బీర్లు..

దండేపల్లి: బీర్ల ధరలు పెంచుతూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి తోడు కేఎఫ్ లైట్‌బీర్ల కొరత ఉండటంతో దండేపల్లి మండలంలోని పలు వైన్స్‌లలో వాటిని బీరు ప్రియులకు అందుబాటులో ఉంచడం లేదని మందుబాబులు ఆరోపిస్తున్నారు. మేదరిపేటలో ఓవైన్స్‌కు మంగళవారం వచ్చిన కేఎఫ్ బీర్ల స్టాకును ఏకంగా బెల్టు దుకాణాలకే తరలించడంపై బీరు ప్రియులు మండిపడ్డారు. వైన్స్‌లలో కేఎఫ్‌లైట్ బీర్లు అడిగితే వాటికి బదులుగా ఇతర బ్రాండ్లు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఎక్సైజ్ అధికారులు కేఎఫ్ లైట్ బీర్లు వైన్స్ దుకాణాల్లో అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

గుడుంబా పట్టివేత



గుడుంబాతో ఎక్సైజ్ సీఐ గురువయ్య, ఎస్సై శ్వేత

భీమారం: మండలంలోని బూర్గుపల్లి, పోతన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి 10లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 4లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ గురువయ్య కథనం ప్రకారం.. భీమారం మండలం బూర్గుపల్లి, పోతన్‌పల్లి గ్రామాల్లో గుడుంబా అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో పాటు ఎస్సై శ్వేత ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో దాడి చేశాం. దరావత్ రాములు(బూర్గుపల్లి), జర్పుల స్వరూప(పోతన్‌పల్లి) ఇళ్లల్లో 4లీటర్ల గుడుంబా లభించింది. 10లీటర్ల బెల్లం పానకం లభించగా ధ్వంసం చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న బాధితులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని గొల్లగట్టు శివారులో గల 73సర్వే నంబర్‌లో గల భూమి తమది అంటూ గొల్లగట్టుకు చెందిన నెందూరి మల్లేష్, బాపు, రాజన్న కుటుంబ సభ్యులు ధర్నా చేపట్టారు. 73సర్వే నంబర్ భూమిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. నిరుపేదలమైన తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై గంగారాం అక్కడకు చేరుకొని ధర్నా చేపట్టడం సరికాదన్నారు. న్యాయం కోసం రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. దీంతో బాధితులు ధర్నా విరమించారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

చెన్నూర్: చెన్నూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎస్సీ గంగాధర్, డీఈ ఎంఎం కైసర్, ఇన్‌చార్జి ఏడీఈ వేణుగోపాల్ తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ అధికారులు హాజరవుతారని తెలిపారు. అవకాశాన్ని చెన్నూర్, భీమారం, కోటపల్లి, జైపూర్ మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నంబాలలో వైద్యశిబిరం

దండేపల్లి: మండలంలోని నంబాల గ్రామంలో కొద్దిరోజులుగా జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జ్వరంతో ఉన్నవారి రక్త నమూనాలు సేకరించి పరీక్షించారు. 90మందికి రక్త పరీక్షలు చేసినట్లు దండేపల్లి వైద్యాధికారి సతీష్ తెలిపారు. డెంగీ, మలేరియా వంటివి ఏమీ లేవన్నారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు వివరించారు. దోమల నివారణకు మందులు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ సాగరిక, సిబ్బంది రాజరెడ్డి, పోసాని, రమణ, శాంతకుమారి, కృష్ణవేని, పద్మ, పంచాయతీ కార్యదర్శి రమేష్, జీపీసిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాలో ఎల్ఐసీ ఏజెంట్లు

పాతమంచిర్యాల: ఎల్ఐసీ ఏజెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంటు ఎదుట మంగళవారం నిర్వహించిన ధర్నాలో జిల్లాకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు. ఎల్ఐసీ మంచిర్యాల బ్రాంచ్‌కు చెందిన ఏజెంట్లు తిరుపతి, మహేశ్, లక్ష్మీనారాయణ, తిరుపతయ్య, స్వామి, వేణు, ఆశీర్‌విల్సన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేరాల నియంత్రణకు కృషి

దండేపల్లి: నేరాల నియంత్రణకు కృషి చేస్తానని దండేపల్లి ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తహసీనొద్దీన్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

'నేతకానీలకు అన్యాయం జరిగితే ఊరుకోం'

చెన్నూర్: ఎస్సీ వర్గీకరణలో నేతకానీలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని నేతకాని జిల్లా అధికార ప్రతినిధి జనగామ తిరుపతి, దుర్గం నరేశ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 15నుంచి 16లక్షల నేతకాని కులస్తులు ఉండగా, కేవలం 1.33లక్షల నేతకానీలు ఉన్నట్లు నివేదికలు సమర్పించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మాజీ ఎంపీ వెంకటేశ్ నేత, మంద కృష్ణమాదిగలు నేతకాని జనాభా విషయంలో మాట్లాడకుండా, రిజర్వేషన్ల విషయం ప్రస్తావించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం నేతకానీలకు అన్యాయం జరగకుండా సమగ్ర సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు రాంటెంకి పోచం, రావుల తిరుపతి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

తాండూర్: కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వైద్యాధికారులు అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల్లో మంగళవారం కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. డీపీఎంవో రాఘవయ్య, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, హెచ్ఈవో లక్ష్మణ స్వామి, ఎస్‌యూవో శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ అప్పగింత

మందమర్రిరూరల్: పట్టణంలోని మూడో జోన్ పోచమ్మ గుడి సమీపంలో గల సులభ్ కాంప్లెక్స్ వద్ద రోడ్డుపై ఈ నెల 9న ఆటో డ్రైవర్స్, కార్మిక సేవా సమితి ఫౌండేషన్ కోశాధికారి సొప్పరి లచ్చన్నకు రూ.25వేల విలువైన మొబైల్ దొరికింది. ఆ మొబైల్‌ను ఫౌండేషన్ చైర్మన్ వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం మొబైల్ పోగొట్టుకున్న శ్రీకాంత్‌ను గుర్తించి వారి ఇంటికి వెళ్లి, శ్రీకాంత్ తల్లి శారదకు అప్పగించి నిజాయతీ చాటుకున్నారు.

పంచాయతీల్లో పనుల నిర్వహణ

చెన్నూర్‌రూరల్: జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మండలంలోని 30గ్రామ పంచాయతీల్లో మిషన్ భగీరథ పనులకు సంబంధించిన నిర్వహణ, రిపేర్ పనులను పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఎంపీవో అజ్మత్ అలీ తెలిపారు. ఆయా పంచాయతీలలో పారిశుధ్య సిబ్బంది ద్వారా చెత్త సేకరణ, మురికి కాలువల పూడికతీత, ప్లాస్టిక్ సేకరణ పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ల్యాప్‌టాప్‌లు అందజేత

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలకు మంగళవారం వ్యాపారవేత్త పాత భాస్కర్ సతీమణి అనిత రెండు ల్యాప్‌టాప్‌లను అందజేసి ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం అందించినట్లు తెలిపారు.